17,654 కంపెనీలు బంద్



గత 10 నెలల్లో మూతబడినట్టు రాజ్యసభలో ప్రకటించిన కేంద్రప్రభుత్వం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: ఈ ఆర్థిక సంవత్సరం (2024-25)లో దేశవ్యాప్తంగా 17వేలకుపైగా కంపెనీలు మూతబడ్డాయి. మంగళవారం రాజ్యసభలో కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి హర్ష మల్హోత్రా ఇచ్చిన లిఖిత పూర్వక సమాధానం ప్రకారం.. గత ఏడాది ఏప్రిల్ మొదలు ఈ ఏడాది జనవరి 26 వరకు మొత్తం 17,654 సంస్థలు షట్‌డౌన్ అయ్యాయి. అయితే వీటిలో ఇతర సంస్థల్లో విలీనమైనవి, బడా సంస్థలకు అమ్ముడైనవి, నష్టాలతో చేతులెత్తేసినవి, ఆర్థిక సమస్యలతో మూతబడినవి అన్నీ ఉన్నాయని మంత్రి వివరించారు. కాగా, గత ఆర్థిక సంవత్సరం (2023-24) 22,044, అంతకుముందు ఆర్థిక సంవత్సరం (2022-23) 84,801 కంపెనీలు బంద్ అయినట్టు తెలుస్తున్నది. మరోవైపు గడిచిన దాదాపు 10 నెలల్లో దేశంలో కంపెనీల చట్టం కింద కొత్తగా 1,38,027 కంపెనీలు నమోదైనట్టు కూడా మంత్రి తెలిపారు. అలాగే 2023-24లో 1,85,318 కంపెనీలు, 2022-23లో 1,59,302 కంపెనీలు నమోదయ్యాయి. ఇకపోతే గత ఐదేండ్లలో దేశంలో 339 విదేశీ కంపెనీలు ఏర్పాటయ్యాయని మల్హోత్రా వెల్లడించారు. ఈ ఏడాదిలో ఏపీ, ఢిల్లీ, కేరళల్లో ఒక్కోటి.. తమిళనాడులో రెండు వచ్చాయన్నారు. నిజానికి 2020 నుంచి భారత్‌లో విదేశీ సంస్థల నమోదు క్రమేణా తగ్గుతున్నట్టు చెప్పారు.

82 దర్యాప్తుల్లో నివేదికలు

గత మూడు ఆర్థిక సంవత్సరాల్లో తీవ్ర మోసాల దర్యాప్తు కార్యాలయం (ఎస్ఎఫ్ఐవో) 82 దర్యాప్తు నివేదికల్ని సమర్పించినట్టు మంత్రి మల్హోత్రా తెలిపారు. కేవలం గత ఆర్థిక సంవత్సరంలోనే 2023-24 గరిష్ఠంగా 40 రిపోర్టులు వచ్చాయని వివరించారు. అయినప్పటికీ నయాపైసా రికవరీ లేదని స్పష్టం చేశారు. ఇక ఈ మూడేండ్లలోనే ఎస్ఎఫ్ఐవోకు మరో 26 కేసులను కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అప్పగించినట్టు చెప్పారు. గడిచిన ఐదేండ్లలోనైతే ఈ సంఖ్య 72గా ఉందన్నారు.

2,664 విల్‌ఫుల్ డిఫాల్టర్లు

గత ఏడాది మార్చి ఆఖరుకల్లా 2,664 మంది ప్రత్యేక రుణగ్రహీతలను ఉద్దేశపూర్వక రుణ ఎగవేతదారులుగా వర్గీకరించినట్టు ఓ లిఖితపూర్వక సమాధానంలో రాజ్యసభకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరి తెలిపారు. వీరిలో వ్యక్తిగత, విదేశీ రుణగ్రహీతలెవరూ లేరని స్పష్టం చేశారు. రుణాలను ఎగ్గొడుతున్నవారిపై కఠిన చర్యలను తీసుకొనేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో కలిసి కేంద్రం పనిచేస్తున్నట్టు వివరించారు.

86 వేలకు చేరువలో పుత్తడి

మరో రూ.500 పెరిగి రూ.85,800కి పదిగ్రాముల ధర

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: బంగారం ధరలు భగభగమండుతున్నాయి. సామాన్యుడికి అందనంత స్థాయికి చేరుకుంటున్న పుత్తడి మరో మైలురాయికి చేరువైంది. వరుసగా ఐదు రోజులుగా పెరుగుతూ వచ్చిన బంగారం ధర మంగళవారం కూడా మరో రూ.500 ఎగబాకి రూ.86 వేలకి చేరువైంది. దేశరాజధాని న్యూఢిల్లీ బులియన్ మార్కెట్ ముగిసే సమయానికి 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల ధర రూ.500 పెరిగి రూ.85,800 పలికింది. ఆభరణాలు, రిటైలర్ల నుంచి డిమాండ్ అత్యధికంగా ఉండటం వల్లనే ధరలు పెరిగాయని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. జనవరి 1 నుంచి ఇప్పటి వరకు గోల్డ్ ధర రూ.6,410 లేదా 8 శాతం ఎగబాకి రూ. 85,800కి చేరుకున్నది. నెల రోజుల క్రితం ఈ ధర రూ.79,380గా ఉన్నది. గత ఐదురోజులుగా పెరుగుతూ వచ్చిన వెండి ధరలు తగ్గుముఖం పట్టాయి. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు అంతంత మాత్రంగానే ఉండటంతో కిలో వెండి రూ.500 తగ్గి రూ.95,500కి పరిమితమైంది. ధరలు తగ్గకముందు ఇది రూ.96 వేలుగా ఉన్నది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర రికార్డు స్థాయి 2,872 డాలర్లకు చేరుకున్నది. కెనడా, మెక్సికో దేశాలపై ట్రంప్ విధించిన పన్ను వాయిదాపడటంతో మదుపరులు తమ పెట్టుబడులను సురక్షితమైన బంగారం వైపు మళ్లించడం ధరలు పెరగడానికి ప్రధాన కారణమని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ వర్గాలు వెల్లడించాయి.

భయపడి మూసేయలేదు

కంపెనీ షట్‌డౌన్‌పై హిండెన్‌బర్గ్ అధినేత అండర్సన్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: అదానీ గ్రూప్ అవకతవకలపై సంచలనాత్మక రిపోర్టుల్నిచ్చిన హిండెన్‌బర్గ్ రిసెర్చ్.. అనూహ్యంగా మూతబడిన విషయం తెలిసిందే. అయితే ఎవరికీ భయపడి తాను సంస్థను మూసేయలేదని ఈ అమెరికన్ షార్ట్ సెల్లర్ వ్యవస్థాపక అధినేత నాథన్ అండర్సన్ స్పష్టం చేశారు. తమపై లీగల్‌గాగానీ లేక వ్యక్తిగతంగాగానీ ఎవరూ ఏ రకమైన బెదిరింపులకు దిగలేదన్న అండర్సన్.. కేవలం పని ఒత్తిడి కారణంగానే హిండెన్‌బర్గ్ రిసెర్చ్‌ను మూసేసినట్టు పీటీఐకిచ్చిన ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. అదానీ గ్రూప్ స్టాక్ మార్కెట్లలో అక్రమాలకు పాల్పడిందంటూ 2023 జనవరిలో హిండెన్‌బర్గ్ రిసెర్చ్ ఓ రిపోర్టును విడుదల చేసిన సంగతి విదితమే. దీంతో అదానీ కంపెనీల షేర్లన్నీ ఒక్కసారిగా కుప్పకూలాయి. తీవ్ర నష్టాలను ఎదుర్కొన్నాయి. ఫలితంగా అటు గ్రూప్, అదానీ వ్యక్తిగత సంపద ఏకంగా 150 బిలియన్ డాలర్లకు పైగా కరిగిపోయింది. వ్యాపార-పారిశ్రామిక వర్గాల్లోనేగాక, రాజకీయంగానూ ఇది తీవ్ర దుమారాన్నే రేపింది. ఇక ఈ వ్యవహారంలో సెబీ చీఫ్ మాధవీ పురి బచ్ దంపతుల హస్తం కూడా ఉందని గత ఏడాది ఆగస్టులో మరో బాంబు పేల్చింది. దీంతో పార్లమెంట్‌లోనూ ఆ ప్రకంపనలు కనిపించాయి. ఈ క్రమంలో ఈ ఏడాది జనవరి 16న ఆశ్చర్యకరంగా హిండెన్‌బర్గ్ రిసెర్చ్‌ను మూసేస్తున్నట్టు, తమవద్ద అన్ని కేసుల దర్యాప్తులు అయిపోయినట్టు అండర్సన్ చెప్పారు. వ్యక్తిగత జీవితానికి ప్రాధాన్యత ఇచ్చేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు స్పష్టం చేశారు. తాజా ఇంటర్వ్యూలోనూ అదే చెప్పారు. 2017లో మొదలైన ఈ కంపెనీ.. 8 ఏండ్లలో అనేక దేశ, విదేశీ కంపెనీలపై సంచలన రిపోర్టుల్నిచ్చింది. ఆ వివరాలను అమెరికా స్టాక్ మార్కెట్ రెగ్యులేటర్లు, దర్యాప్తు ఏజెన్సీలకు పంపింది.

ఎన్ఎస్ఈ లాభం 3,834 కోట్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: దేశంలో అతిపెద్ద స్టాక్ ఎక్స్ఛేంజ్ ఎన్ఎస్ఈ విశ్లేషకుల అంచనాలకుమించి రాణించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను రూ.3,834 కోట్ల నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో వచ్చిన రూ.1,975 కోట్ల లాభంతో పోలిస్తే 94 శాతం ఎగబాకింది. సమీక్షకాలంలో ఆదాయం ఏడాది ప్రాతిపదికన 21 శాతం ఎగబాకి రూ.3,974 కోట్ల నుంచి రూ. 4,807 కోట్లకు చేరుకున్నది. అలాగే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొమ్మిది నెలల్లో రూ. 45, 499 కోట్ల ఆదాయంపై రూ.14,780 కోట్ల నికర లాభాన్ని గడించింది.

మళ్లీ 78 వేల పైకి సెన్సెక్స్

1,400 పాయింట్లు లాభపడ్డ సూచీ • 380 పాయింట్లు ఎగిసిన నిఫ్టీ

ముంబై, ఫిబ్రవరి 4: దేశీయ స్టాక్ మార్కెట్లు రివ్వున ఎగిశాయి. మెక్సికో, కెనడాలపై విధించిన టారిఫ్‌లను తాత్కాలికంగా వాయిదావేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ప్రకటించడంతో అంతర్జాతీయ స్టాక్ మార్కెట్లు ఒక్కసారిగా పుంజుకున్నాయి. ఇదే క్రమంలో గత కొన్ని రోజులుగా నష్టాలు ఏరులైపారుతున్న దేశీయ మార్కెట్లు కదంతొక్కాయి. మదుపరులుగు ఎగబడి కొనుగోళ్లు జరపడంతో 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ ఇంట్రాడేలో 1,472 పాయింట్లు లేదా 2 శాతం వరకు లాభపడింది. చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 1,397.07 పాయింట్లు లేదా 1.81 శాతం అందుకొని 78,584.81 పాయింట్ల వద్దముగిసింది. దీంతో సూచీలు నెల గరిష్ఠ స్థాయికి చేరుకున్నట్లు అయింది. మరోసూచీ నిఫ్టీ సైతం 378.20 పాయింట్లు లేదా 1.62 శాతం అందుకొని 23,739.25 వద్ద ముగిసింది. జనవరి 3 తర్వాత సూచీలకు ఇదే గరిష్ఠ స్థాయి ముగింపు కావడం విశేషం. రిజర్వుబ్యాంక్ తన పరపతి సమీక్షలో వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలుండటం కూడా మదుపరులను కొనుగోళ్ల వైపు నడిపించాయి. దీంతో 6 లక్షల కోట్ల మదుపరుల సంపద పెరిగింది. బీఎస్ఈలో లిస్టైన కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ విలువ రూ.5,95,996.51 కోట్లు పెరిగి రూ.4,25,50,826.11 కోట్లు(4.88 ట్రిలియన్ డాలర్లు)కు చేరుకున్నది. వాణిజ్య యుద్ధానికి తెరలేపిన ట్రంప్..ఇతర దేశాల నుంచి ఒత్తిడి ఎక్కువ కావడంతో రెండు దేశాలపై విధించిన టారిఫ్ విషయంలో వెనక్కి తగ్గడం సూచీల్లో జోష్ పెంచిందని మోతీలాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హెడ్ సిద్ధార్థ తెలిపారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికిగాను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సార్వత్రిక బడ్జెట్‌పై మదుపరులు వేచి చూసే దోరణి అవలంభించినప్పటికీ గ్లోబల్ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలు సూచీలు పెరగడానికి ప్రధాన కారణం.

- ఎల్అండ్‌టీ 4.76 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది.
- అదానీ పోర్ట్స్, ఇండస్ఇండ్ బ్యాంక్, టాటా మోటర్స్, రిలయన్స్, అల్ట్రాటెక్ సిమెంట్, ఏషియన్ పెయింట్, యాక్సిస్ బ్యాంక్, ఎన్‌టీపీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, కొటక్ బ్యాంక్, ఎస్బీఐ, ఇన్ఫోసిస్, సన్‌ఫార్మా, ఐసీఐసీఐ బ్యాంక్, టీసీఎస్, టాటా స్టీల్, మహీంద్రా, ఎయిర్‌టెల్, టైటాన్, ఐటీసీ షేర్లు లాభాల్లో ముగిశాయి.
- ఐటీసీ హోటల్స్, జొమాటో, నెస్లె, మారుతి, హెచ్‌యూఎల్ షేర్లు నష్టపోయాయి.
- రంగాలవారీగా చూస్తే క్యాపిటల్ గూడ్స్ 3.42 శాతం, ఇండస్ట్రీయల్స్ 2.59 శాతం, ఎనర్జీ 2.50 శాతం, ఆయిల్ అండ్ గ్యాస్ 2.40 శాతం, పవర్ 2.31 శాతం, ఆర్థిక సేవలు 2 శాతం చొప్పున లాభపడ్డాయి. కానీ, ఎఫ్ఎంసీజీ రంగ షేర్లు పతనం చెందాయి.

టాటా కార్లపై భారీ డిస్కౌంట్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: ఎంపిక చేసిన మాడళ్లపై టాటా మోటర్స్ తాజాగా లక్ష రూపాయల వరకు తగ్గింపు ప్రకటించింది. వీటిలో టియాగో, టిగోర్, ఆల్ట్రోజ్, పంచ్, నెక్సాన్, హరియర్, సఫారీ మాడళ్లున్నాయి. పెట్రోల్/సీఎన్‌జీ రకాల విషయానికొస్తే.. టియాగో మాడల్‌పై రూ.35 వేలు రాయితీ ఇస్తున్నది. రూ.20 వేలు కన్స్యూమర్ డిస్కౌంట్, మరో రూ.15 వేలు ఎక్స్ఛేంజ్ డిస్కౌంట్‌లున్నాయి. ఇలాగే టిగోర్‌పై రూ.45 వేలు, ఆల్ట్రోజ్‌లో రేసర్ మినహా మిగతా వేరియంట్లపై రూ.65 వేలు, పంచ్‌పై రూ.25 వేలు, నెక్సాన్ మాడళ్లపై రూ.45 వేల రాయితీలున్నాయి. ఇక ఎస్‌యూవీ మాడళ్లైన హరియర్, సఫారీ అన్ని డీజిల్ వేరియంట్లపై రూ.75 వేల వరకు డిస్కౌంట్ వస్తున్నది. మరోవైపు, ఆల్ట్రోజ్, నెక్సాన్ డీజిల్ అన్ని రకాలపై 65వేలు, 45వేల చొప్పున డిస్కౌంట్‌లున్నాయి. అయితే ఆల్ట్రోజ్ పెట్రోల్ రేసర్ వేరియంట్‌పై గరిష్ఠంగా లక్ష డిస్కౌంట్ ఉన్నది. జనవరిలోనూ కంపెనీ రూ.85 వేల తగ్గింపునిచ్చినది తెలిసిందే.

హీరోకు 456 కోట్ల జీఎస్టీ నోటీసు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: దేశీయ ఆటోరంగ దిగ్గజం, ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ హీరో మోటోకార్ప్‌కు రూ.456.06 కోట్ల జీఎస్టీ డిమాండ్ నోటీసు వచ్చింది. రాజస్థాన్‌లోని అల్వార్ సెంట్రల్ జీఎస్టీ అదనపు కమిషనర్ నుంచి ఈ తాఖీదులు అందాయి. 2017 జూలై నుంచి 2024 మార్చి వరకు సరఫరా జరిగిన వాహన విడిభాగాలు, ఇతర రత్రా వాటి ధరలకు సంబంధించిన వ్యవహారంలో ఈ నోటీసులు జారీ అయ్యాయి. మరోవైపు ప్రభుత్వ రంగ జీవిత బీమా సంస్థ ఎల్ఐసీకి కూడా రూ.101. 95 కోట్ల జీఎస్టీ డిమాండ్ నోటీసు వచ్చింది. గత ఐదు ఆర్థిక సంవత్సరాలకుగాను ఆయా రాష్ట్రాల్లో జీఎస్టీ షార్ట్ పేమెంట్లకు సంబంధించి ఈ నోటీసు విడుదలైందని మంగళవారం ఎల్ఐసీ తెలిపింది. కాగా, త్వరలో జీఎస్టీ శ్లాబులు, రేట్లపై జీఎస్టీ కౌన్సిల్ ఓ నిర్ణయం తీసుకుంటుందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తెలియజేశారు.

రామగుండం రిక్రియేషన్ క్లబ్ ప్రారంభం

విద్యార్థినులకు సైకిళ్లు అందజేస్తున్న ఆర్ఆర్‌సీ ప్రతినిధులు, ఎమ్మెల్యే

కోల్‌సిటీ, ఫిబ్రవరి 4ః రామగుండం పారిశ్రామిక ప్రాంతం కేంద్రంగా తొలిసారిగా వివిధ రంగాలకు చెందిన ప్రముఖులతో ఆవిర్భవించిన రామగుండం రిక్రియేషన్ క్లబ్ ప్రారంభ వేడుక అట్టహాసంగా జరిగింది. స్థానిక ప్రైవేటు ఫంక్షన్ హాలులో జరిగిన ఈ వేడుకను ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ దంపతులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిరుపేద విద్యార్థులకు క్లబ్ ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగులు, సైకిళ్లు అందజేశారు. అనంతరం సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. క్లబ్ అధ్యక్షుడు బల్మూరి అమరేందర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పుప్పాల విక్రమసింహారావు, ప్రధాన కార్యదర్శి ఎం శ్రీనివాస్, కోశాధికారి అశోక్‌రావు, సంయుక్త కార్యదర్శి బుచ్చిరెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి నిట్టూరి జీవన్‌బాబు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు తానిపర్తి గోపాల్‌రావు, రియాజ్ అహ్మద్, మేడ చక్రపాణి, చంద్రశేఖర్, రాజిరెడ్డి, రాజమల్లు గౌడ్, రాజేశ్వరరావు, సురేశ్, మంచికట్ల వెంకటస్వామి, వెంకటరామిరెడ్డి, కొలిపాక సమ్మయ్య, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టం అమలు చేయాలి

గోదావరిఖని, ఫిబ్రవరి 4: సమాచార హక్కు చట్టం అమలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యత వహించాలని వక్తలు పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ అభివృద్ధి వనరుల కేంద్రంలో సమాచార హక్కు చట్టంపై రెండోరోజు శిక్షణ తరగతుల్లో పలు అంశాలపై విస్తృతంగా చర్చించారు. ప్రతి వినియోగదారుడు తన ఫిర్యాదును భారత ప్రభుత్వ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దేశంలో ఎక్కువగా ఈ సమాచార హక్కు చట్టం మహారాష్ట్రలో విజయవంతంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ, ఏపీలో సమాచార హక్కు చట్టం విషయంలో సరిగా అమలు కావడం లేదని, సమాచారం సరిగా ఇవ్వడం లేదని వక్తలు పేర్కొన్నారు. బిహార్‌లో ఫోన్ ద్వారా సమాచార హక్కు చట్టం జాన్కారి అనే వ్యవస్థ ద్వారా వివరాలు తీసుకుంటున్నారని , ఇలాంటి విధానాన్ని తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయాలని వారు కోరారు. ఇక్కడ శిక్షణ తరగతుల కోర్డినేటర్ శ్రీనివాస్ మాధవ్, ఫ్యాకల్టీ ఇన్‌చార్జి కె సౌమ్య రాణి, సింగరేణి విశ్రాంతి ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు ఆళ వందార్ వేణుమాధవ్, రాళ్లబండి రాజన్న, కోటిలింగం, మెరుగు రాజయ్య ఉన్నారు.

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు

సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఏసీపీ కృష్ణ

ఓదెల, ఫిబ్రవరి 4: నేరాలను నియంత్రించడానికి సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ పేర్కొన్నారు. కనగర్తి గ్రామంలో ఏర్పాటు చేసిన15 సీసీ కెమెరాలను ఏసీపీ మంగళవారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే ఏదైనా నేరాలు జరిగినప్పుడు నిందితులను త్వరగా పట్టుకునే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, పొత్కపల్లి ఎస్ఐ దీకొండ రమేశ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యమా.. చేతులెత్తేశారా?

- వారం నుంచి వృథాగా నీటి ప్లాంట్
- వేసవి రాకముందే నీటి కటకట

నీటి సరఫరా నిలిచిపోయిన స్టేడియం పక్కన గల ఆర్వో వాటర్ ప్లాంట్

కోల్‌సిటీ, ఫిబ్రవరి 4: రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన ఆర్వో వాటర్ ప్లాంట్ (నీటి శుద్ధి కేంద్రం)లపై నిర్లక్ష్యమా...? కావాలనే చేతులెత్తేస్తున్నారా..? అన్న సందేహాలు వెల్లువెత్తుతున్నాయి. వారం నుంచి నీటి సరఫరా లేక ..పట్టించుకునే దిక్కు లేదు. వేసవి రాకముందే అప్పుడే నీటి కటకట మొదలైందా..? అనడానికి గోదావరిఖనిలోని పరశురాంనగర్ కమాన్ వద్ద సింగరేణి యాజమాన్యం ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్ ఇందుకు నిదర్శనం. బీఆర్ఎస్ హయాంలో అప్పటి శాసన సభ్యులు కోరుకంటి చందర్ సింగరేణి ఓసీపీ-5 ప్రాజెక్టు ప్రభావిత ప్రాంతాలైన 11, 12, 13, 33, 32, 44 తదితర డివిజన్ల ప్రజలకు శుద్ధమైన నీటిని అందించాలని పట్టుబట్టి సింగరేణి యాజమాన్యంతో మాట్లాడి ఆర్వో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయించారు. దీనిలో భాగంగా పరశురాంనగర్, ఫైవింక్లయిన్ ఏరియా తదితర ప్రాంతాలలో ఆర్జీ-1 యాజమాన్యం ఒక్కో ప్లాంట్‌కు రూ.10లక్షల చొప్పున వెచ్చించి నాలుగు ప్లాంట్లు నిర్మించింది. అప్పటి నుంచి ఈ ప్రాంత కార్మిక కుటుంబాలకు ఈ ప్లాంట్ ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందిస్తుంది. ఇక ప్రభుత్వం మారడంతో 12వ డివిజన్‌లో గల ప్లాంట్‌ను ప్రారంభించడమే మానుకుంది. దీనితో ఆ డివిజన్ కార్పొరేటర్, అక్కడి ప్రజలు అనేకమార్లు ఆందోళనలు చేపట్టగా, ఇటీవలనే వినియోగంలోకి తీసుకవచ్చింది. ఐనప్పటికీ ప్లాంట్ నిర్వహణలో తరచూ సమస్యలు తలెత్తుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇకపోతే 33వ డివిజన్‌లోని సింగరేణి స్టేడియం ఆనుకొని ఉన్న ఆర్వో వాటర్ ప్లాంట్ మాత్రం వారం రోజులుగా నిరుపయోగంగా మారింది. నీటి సరఫరా ఆగిపోవడంతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నా పట్టించుకోవడం లేదు. అధికారులు ఉద్దేశపూర్వకంగానే పట్టించుకోవడం లేదని స్థానికులు, బీఆర్ఎస్ నాయకులు వాపోతున్నారు. ఇప్పటికే ఓసీపీ-5 ప్రాజెక్టు వల్ల దుమ్ము, దూళి విపరీతంగా లేచి ఇండ్లలో పడటంతో చర్మ సంబంధిత వ్యాధులతో అనేక మంది బాధపడుతున్నారు. కనీసం నీటి సరఫరా అయినా పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

సింగరేణి సీఎండీ బలరాం నాయక్‌కు పూల మొక్క అందజేస్తున్న నాయకులు

సింగరేణి సీఎండీని కలిసిన నాయకులు

గోదావరిఖని, ఫిబ్రవరి 4: సింగరేణి సీఎండీగా బలరాం నాయక్‌కు మరో ఏడాదిపాటు పదవీ కాలం పొడగింపుపై హర్షం వ్యక్తం చేస్తూ ఏఐటీయూసీ నాయకులు అభినందనలు తెలిపారు. మంగళవారం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో సీఎండీని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధానకార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు పూల మొక్క బహూకరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ ఏఐటీయూసీ ఉప ప్రధానకార్యదర్శి కే సారయ్య, కందికట్ల వీరభద్రం, వైవీ రావు, ముస్కె సమ్మయ్య ఉన్నారు.

నేత్రదానం

ఓదెల, ఫిబ్రవరి 4: ఓదెల గ్రామానికి చెందిన చెరుకు రాజవీరు మంగళవారం మృతి చెందగా, అతని కళ్లను కుటుంబ సభ్యులు సదాశయ ఫౌండేషన్‌కు దానం చేశారు. ఇందుకు సదాశయ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి భీష్మాచారి నేత్రదాత కుటుంబ సభ్యులను అభినందించారు. మరణించిన తర్వాత నేత్రాలను దానం చేయడం ద్వారా ఇద్దరు అంధులకు చూపు ప్రసాదించిన వారవుతారన్నారు

ఎమ్మెల్సీ ఎన్నికలకు 3 నామినేషన్లు

జగిత్యాల, ఫిబ్రవరి 4: మెదక్, నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మంగళవారం మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఇందులో గ్రాడ్యుయేట్ స్థానానికి ఇద్దరు, టీచర్ స్థానానికి ఒక్కరు నామినేషన్లు వేశారు. అభ్యర్థుల నుంచి ఎన్నికల అధికారి, కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి తన చాంబర్‌లో నామినేషన్లు స్వీకరించారు.

రిటైర్డు కార్మికులను విస్మరించడం దురదృష్టకరం

రామగిరి, ఫిబ్రవరి 4: సింగరేణిలో సుదీర్ఘకాలం పని చేసి ఉద్యోగ విరమణ పొందిన రిటైర్డు కార్మికులను యాజమాన్యం పట్టించుకోవడం లేదని సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు గౌతం శంకరయ్య అన్నారు.సెంటినరీకాలనీలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నో ఒడిదొడుకులతో నష్టాల్లో ఉన్న సింగరేణి సంస్థను లాభాల్లోకి తీసుక వచ్చేందుకు తమ రక్తాన్ని చెమటగా మార్చి సంస్థ అభివృద్ధికి తమ జీవితంను ధారపోసిన రిటైర్డు కార్మికుల పట్ల చిన్నచూపు చూడవద్దన్నారు. చాలా మంది రిటైర్డు కార్మికులు ఇప్పటికి రూ.2వేల పెన్షన్‌తో ఎన్నో ఇబ్బందులు పడుతున్నారనీ, 11వ వేజ్‌బోర్డుకు సంబంధించి పెన్షన్ ఇంకా రివైజ్ చేయకపోవడం వల్ల మానసిక క్షోభకు గురవుతున్నారన్నారు. సీపీఆర్ఎంఎస్ హెల్త్ కార్డులు చాలా మందికి చివరి స్టేజికి వచ్చాయని హాస్పిటల్‌లో ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ప్రతి రిటైర్డు కార్మికుడికి రూ.20వేల పెన్షన్ ఉండేలా చూడాలని కోరారు.

దళితబంధు నిధులు విడుదల చేయాలి

కథలాపూర్, ఫిబ్రవరి 4: మండలంలో దళితబంధు పథకం రెండో విడుత నిధులు విడుదల చేయాలని మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి మంగళవారం లబ్ధిదారులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దళితబంధు పథకం రెండో విడుతలో మండలంలో 60 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. అప్పటి వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు లబ్ధిదారుల జాబితాను కలెక్టర్‌కు అందించారన్నారు. ఎన్నికల కోడ్ కారణంగా కొంతమంది లబ్ధిదారులకు నిధులు రాలేదని, ఈ విషయంలో అధికారులు న్యాయం చేయాలని కోరారు.

పుస్తకాల ఆవిష్కరణ

గోదావరిఖని, ఫిబ్రవరి 4: కార్మిక నేత బొజ్జ బిక్షమయ్య, ప్రముఖ రచయిత కాలువ మల్లయ్య రచించిన బుద్ధుడు నుంచి గద్దర్ వరకు, అస్పృశ్యయోధుడు అనే పుస్తకాల ఆవిష్కరణ మంగళవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగింది. మినిమమ్ వేజ్‌బోర్డు కమిటీ చైర్మన్ జనక్‌ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ హాజరై పుస్తకాలను ఆవిష్కరించారు. రచయితలు పుస్తకాలపై సమీక్ష ప్రసంగం చేశారు. ఇక్కడ అభ్యుదయ రచయితల సంఘం జాతీయ కార్యదర్శి వేల్పుల నారాయణ, జర్నలిస్టు మాదాసి రామ్మూర్తి, సీఐటీయూ నాయకులు రాజారెడ్డి, పుస్తక రచయితలు బొజ్జ బిక్షమయ్య, కాలువ మల్లయ్య ఉన్నారు.

ఎల్వోసీ అందజేత

ముత్తారం, ఫిబ్రవరి4: అడవి శ్రీరాంపూర్‌కు చెందిన గట్టు లక్ష్మి కిడ్నీ సంబంధిత వ్యాధితో నిమ్స్ హాస్పటల్ చికిత్స పొందుతున్నది. చికిత్సకు డబ్బుల కోసం దాతలను అర్థిస్తున్నది. ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకి తెలుపగా స్పందించిన ఆయన సీఎంఆర్ ఎఫ్ ద్వారా వైద్య ఖర్చుల నిమిత్తం రూ. లక్ష ఎల్వోసీ మంజూరు చేయించి బాధిత కుటుంబానికి అందించారు. ఈ సందర్భంగా మంత్రికి బాధిత కుటంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

గీత కార్మికుడికి గాయాలు

స